ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

- కొడంగల్‌తో సమానంగా కామారెడ్డికి సహాయం
- సిఎం రేవంత్ రెడ్డి

బాధితులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి హైద్రాబాద్ బ్యూరో

భారీ వర్షాలు,వరదల వల్ల నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని, ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేస్తామన్నారు. గురువారం మంత్రి పొంగులేటి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కామారెడ్డిలో జీఆర్ కాలనీ సందర్శించారు. వరద బాధితులను స్వయంగా కలిసి మాట్లాడారు. వారి సమస్యలను విన్నారు. సిఎం మాట్లాడుతూ..వరదల నేపథ్యంలో వెంటనే తాత్కాలికంగా సమస్య పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అప్రమత్తంగా ఉండటం వల్లే ఆస్తినష్టం జరిగినా - ప్రాణనష్టం తగ్గించగలిగామన్నారు. వరదలు రాగానే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందిగా ఇంచార్జ్ మంత్రి సీతక్కను, షబ్బీర్ అలీ, ఎంపి షెట్కర్ తో పాటు ఎమ్మెల్యేలను ఆదేశించామన్నారు. పూర్తి స్థాయి వరద నష్టంతో పాటు మళ్లీ ఇలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్థానిక ప్రజల సమస్య పరిష్కారానికి వంద శాతం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కొడంగల్ కు ఎంత సాయం చేస్తానో.. కామారెడ్డికి కూడా అంత సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఐడిసిసిలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షాసమావేశం నిర్వహించారు. వరద నష్టం ఎక్కువగా జరగకుండా అప్రమత్తమై సరైన సమయంలో స్పందించి చర్యలు చేపట్టిన అధికారుల కృషిని సిఎం అభినందించారు. కష్ట సమయంలో శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో వ్యవహరించాలి. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పకడ్బందీగా అమలు చేయాలి . రాబోయే 15 రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తా . ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సమీక్షలో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లండి.

నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రిలీఫ్ ఫండ్ ను రాబట్టుకోవాలి ...అని సీఎం అన్నారు.

ముస్లింలకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు

టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, ప్రేమ, సహనం, త్యాగం, సేవ మార్గంలో జీవించాలని అల్లాహ్ ప్రబోధించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శాంతిమార్గాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈ పండుగను ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రవక్త బోధనలు కేవలం ముస్లింలకే కాకుండా సకల మానవాళికి అనుసరణీయమని గుర్తు చేశారు. సమాజంలో సామరస్యాన్ని, మానవతా విలువలను పెంపొందించే దిశగా ప్రవక్త బోధనలు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

మహాసభలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

అక్టోబర్ 8,9 తేదీల్లో గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర మహాసభలు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయితీ సిబ్బంది ఉద్యోగ భద్రతతో పాటు హక్కుల పరిరక్షణకై నిరంతరం పోరాడుతున్న తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభలు అక్టోబర్ 8,9 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో నిర్వహించనున్నట్టు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్ తెలిపారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మల్టీ పర్పస్ వర్కర్ విధానంతో పంచాయతీ కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల అనేకమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో ఆదివారం, పండుగలకు సైతం సెలవులు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. వేతనాలు సకాలంలో అందక కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్ర మహాసభల్లో చర్చించి తగిన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభల జయప్రదానికి గ్రామ పంచాయితీ సిబ్బందితో పాటు ఉద్యమ శ్రేయోభిలాషులు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు కందునూరి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, నాయకులు ఉండీ మొయినుద్దీన్, ధర్మారపు సుధాకర్, ఎస్‌కె లతీఫ్, ప్రసాద్, ఉపేంద్రాచారీ, అశోక్, చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం వేళ ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా 6వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 7న ఉదయం 10గంటల వరకు హైదరాబాద్‌లో గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరగనుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నగరవాసులు పోలీసులకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.బాలాపూర్ నుంచి వచ్చే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ నుంచి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి వచ్చేవి ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుకుంటాయి. టప్పచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలకు ఎంజే మార్కెట్‌లోకి మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రధాన నిమజ్జన రూట్లలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తారు. సౌత్ ఈస్ట్ జోన్ కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు మళ్లింపులు ఉంటాయి. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, దరుష్షిఫా ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. శివాజీ బ్రిడ్జ్, పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, వైఎంసిఏ ప్రాంతాలలో ఆంక్షలు అమలులో ఉంటాయి. లిబర్టీ, అబిడ్స్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ జంక్షన్లలో వాహనాలను అనుమతించరు. నార్త్ జోన్: పాట్నీ, పరడైజ్, రాణిగంజ్ ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్లిస్తారు.

సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించాలి

- సొంత ఇంటి పథకం అమలుకు కార్మికులు బ్యాలెట్ ఓటులో పాల్గొనాలి
- ఈనెల 11, 12తేదీల్లో పని ప్రదేశాల్లో బ్యాలెట్ బాక్స్‌ల ఏర్పాటు
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలు ప్రకటించి అందులో 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సివిల్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో "సింగరేణి కార్మికులకు సొంత ఇల్లు కావాలా.. కంపెనీ క్వార్టర్ కావాలా.." అనే నినాదంతో కార్మికుల మనోగతాన్ని బహిర్గతం చేసేందుకు ఈనెల 11, 12 తేదీల్లో బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల అభిప్రాయాన్ని బ్యాలెట్ ఓటింగ్ ద్వారా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్మికులంతా బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొని వారి అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు. కార్మికులు ఇండ్ల మరమ్మత్తుల విషయంలో సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు ఇచ్చిన సొంత ఇంటి కల నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. సింగరేణి కార్మికులు ఇల్లు నిర్మించుకునేందుకు ఒకొక్కరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు అవకాశం ఉన్నదని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 1300 ఎకరాల భూమిని సిఐటియు గుర్తించిన విషయాన్ని సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఈ స్థలంలో కార్మికులకు సొంత ఇల్లు నిర్మించే అవకాశం ఉందన్నారు. సింగరేణి కార్మికుల నివాసం ఉంటున్న ఇల్లు శిథిలా వ్యవస్థకు చేరుకున్నాయని, వాటి జీవితకాల ముగిసిందని తెలిపారు. అయినప్పటికీ ప్రమాదపు అంచున కార్మికులు అదే ఇండ్లల్లో ఉంటున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల ఇండ్ల మరమత్తు పేరుతో సివిల్ డిపార్ట్మెంట్ అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ విషయమై విజిలెన్స్ విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. బదిలీలకు దరఖాస్తు పెట్టుకున్న కార్మికులు, ఉద్యోగులకు బదిలీలు నిర్వహిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. అలాగే, ఈ నెల15న సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించేందుకు యూనియన్ పిలుపునిచ్చిందని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లు, గాజుల రాజారావు, సూరం ఐలయ్య, సంపత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

104 ఎఫ్‌డిహెచ్‌ఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కమిషనర్‌కు టియుఎంహెచ్‌ఇయు వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

104 ఎఫ్‌డిహెచ్‌ఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్‌ఇయు - సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్, నాయకులు ఎన్.శ్రీనాథ్ హైదరాబాద్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు సమ్మె నోటీస్‌ను అందజేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళతామని హెచ్చరించారు.

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 104 ఎఫ్‌డిహెచ్‌ఎస్ సేవలను 2022లో నిలిపేసిందని తెలిపారు. దాదాపు 1,095 మంది డిఎంహెచ్‌ఒల పరిధిలో వివిధ విభాగాల పరిధిలో పని చేస్తున్నట్టు చెప్పారు. వారిలో 710 మందికి కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చి మిగిలిన 381 మందికి ఇవ్వలేదని పేర్కొన్నారు. అదే విధంగా ఉద్యోగులందరికి ఏప్రిల్ నెల నుంచి ఆరు నెలల వేతనాలను పెండింగ్‌లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. మిగిలిన వారికి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. డీఎంఈ పరిధిలోకి మార్చిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి సొంత జిల్లాలకు మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆచరణీయం

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, ప్రేమ, సహనం, త్యాగం, సేవ మార్గంలో జీవించాలనే అల్లాహ్ సందేశాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజు అని తెలిపారు.

పోలీసులకు చిక్కిన ఆకతాయిలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ గణేశ్ మండపం పరిసరాల్లో ఆకతాయిల చేష్టలు హద్దు మీరాయి. 9 రోజుల వ్యవధిలో మహిళలను వేధింపులకు గురి చేసిన 930 మంది ఆకతాయిల్ని షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి. వారిలో 55 మంది మైనర్లు కాగా.. మిగతావారంతా మేజర్లే . గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ఖైరతాబాద్ మహాగణపతి మండపం పరిసరాల్లోనే 15 మంది షీ టీమ్స్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ఆకతాయిలు వేధిస్తే.. డయల్ 100 ఫిర్యాదు చేయాలని సూచించారు.

యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

- ఎరువుల కోసం రైతుల పడరాని పాట్లు
- సహకార కేంద్రాన్ని సందర్శించిన జూలకంటి

రైతులతో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఎంత యూరియా అవసరముంది.. ఇప్పుడు వరకు వచ్చిన యూరియా ఎంత? ఇంకా ఎంత రావాలి.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా ప్రణాళిక వేసుకోకపోవడం, ఆ మేరకు యూరియాను తెప్పించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బిజెపియేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు యూరియా కేటాయింపు తగ్గించి రైతులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆయకట్టులో వరి పంట సాగు చేసి నెలరోజులు దాటిందని చెప్పారు. ఇప్పటివరకు రెండుసార్లు యూరియా చల్లాల్సి ఉన్నప్పటికీ ఒక్కసారైనా చల్లలేదని తెలిపారు. యూరియా కొరత తీవ్రంగా ఉందని, దాని ఫలితంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉందని అన్నారు. యూరియా కోసం రైతులు పగలు రాత్రి అని తేడా లేకుండా సొసైటీల వద్ద తిండి.. నీళు మానేసి రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పంట వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చాక అమ్ముకునే వరకు కూడా పోరాడాల్సి వస్తోందని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అవసరమైన యూరియాను రైతులకు అందించాలని, లేనియెడల పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, టూటౌన్ కార్యదర్శి భావండ్ల పాండు, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావునాయక్ తదితరులు ఉన్నారు.

120 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

- నేడు హైదరాబాద్ శిల్పకళావేదికలో టీచర్స్‌డే
- ముఖ్యఅతిథిగా హాజరు కానున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025కు 120 మంది టీచర్లని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 49 మంది, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లు 11 మంది, డిగ్రీ కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు 56 మంది, సాంకేతిక విద్యాశాఖలో నలుగురు అధ్యాపకులు కలిపి మొత్తం 120 ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారికి గురుపూజోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవార్డులను ప్రదానం చేస్తారు. వారిని సన్మానించడంతోపాటు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, బంగారుపూత పూసిన రజత పతకాన్ని అందజేస్తారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలతోపాటు మోడల్ స్కూళ్లు, కెజిబివిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు ప్రత్యేక అతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు విశిష్ట అతిథిగా సిఎస్ కె రామకృష్ణారావు పాల్గొంటారు.

NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
DISPUTE NO.59/2025

Between:
M/S.MARGADARSI CHIT FUND (P) LTD., NARASARAOPET. REP BY ITS FOREMAN/BR.MANAGER ... DISPUTANT
AND
MR.S.RAMU AND OTHERS ... OPPONENTS

TO
OPPONENT NO.1: Mr. Sakamuri Ramu, S/o.S.Muna Swamy Naidu, a/a. 50 Years, Prop: M/s. S.R. Videos, T.V. Serial Camara, Shooting and Suppliers, Flat No.303, Aasharya Avenue, Panchavati Colony, Manikonda, Hyderabad. R/o.Flat No.501, 5th Floor, Five Star Homes, Road No.16, Panchavati Colony, Manikonda, Hyderabad, Telangana State.
OPPONENT NO.2. Mr. Kunam Krishna Reddy, S/o.K.Venkata Ramireddy, a/a. 50 Years, Partner, M/s.S.K.S. Buildings, D.no.8-1-284/ou/604, O.U. Colony, Shaikpet, Golkonda, Hyderabad. R/o. Flat No.401,Five Star Homes, Road No.16, Panchavati Colony, Manikonda, Hyderabad, Telangana State.
OPPONENT NO.3.Mr. Cheboina Venkata Paideswara Rao, S/o.Ch.Venkateswara Rao, a/a. 59 Years, W/As. Income Tax Officer, O/o. Dy. Commissioner Income Tax, Signature Towers, Opp. Botanical Gardens, Kondapur, Hyderabad. R/o. Flat No.301, Five Star Homes, Road No.16, Panchavati Colony, Manikonda, Hyderabad, Telangana State.
OPPONENT NO.5. Mr. Jonnala Koti Reddy, S/o.J.Seashireddy, a/a. 50 Years, Prop: M/s. Skandas Power Light, Plot No.528-111, Road No.86, Jublee Hills, Hyderabad. R/o. Plot No.1A, 3rd Floor, Near Lanco Hills, Hanuman Nagar, Manikonda, Hyderabad, Telangana State.

Please take notice that the above dispute is filed against Opponent Nos.1,2,3 and 5 of you and 1 others for recovery of Rs.19,49,843/- (Rupees NINETEEN LAKHS FORTY NINE THOUSAND EIGHT HUNDRED AND FORTY THREE ONLY) and the same is posted to 20-09-2025 for the appearance of you i.e., Opponent Nos.1,2,3 and 5 before the Deputy Registrar of Chits, Narasaraopet, O/o.District Registrar, Narasaraopet at 10.30 A.M., if you failed to attend the O/o.Deputy Registrar of Chits, on that day the matter will be heard and decided exparte basis on the material available.

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS, NARASARAOPET)
G.V.SUBRAHMANYAM
ADVOCATE FOR DISPUTANT

పెసల రైతుకు ధరల బాధలు

- మార్క్‌ఫెడ్ కేంద్రాలు లేక దక్కని గిట్టుబాటు
- వర్షాలతో అటు దిగుబడి రాక.. ఇటు రేట్లు లేక వ్యథలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖరీఫ్‌లో సాగు చేసిన పెసర పంటకు కనీస మద్దతు ధర కరువైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.8,682 మద్దతు ధర ఎక్కడా అమలు కావటం లేదు. రబీలో ఎలాగూ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఉండవు కాబట్టి కనీసం ఖరీఫ్‌లోనైనా వీటి ద్వారా గిట్టుబాటు ధర పొందుదామని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయింది. ఓవైపు కోతల సమయంలో అధిక వర్షాలు వచ్చి పంట దెబ్బతిన్నది. ఎకరానికి నాలుగు క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన చోట రెండు క్వింటాళ్లే వచ్చింది. మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే కనీసం గిట్టుబాటు ధరైనా దక్కుతుందని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 70వేల ఎకరాలకు పైగా పెసర సాగు చేయగా 20 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాల ఏర్పాటు జాప్యమవుతుండటంతో ప్రయివేటు వ్యాపారులు అరకొర ధరలకే పెసలు కొంటున్నారు.

క్వింటాకు రూ.3వేల వరకు నష్టం

మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు అరకొర ధరలు మాత్రమే పెడుతున్నారు. తద్వారా క్వింటాకు రూ.3వేల వరకు రైతులు నష్టపోతున్నారు. గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పెసలు గరిష్ఠ ధర రూ.8,000, కనిష్ఠ ధర రూ.3000, నమూనా ధర రూ.5,700 మాత్రమే నమోదయ్యాయి. బుధవారం రూ.6,050గా ఉన్న నమూనా, రూ.నాలుగు వేలు నమోదైన కనిష్ఠ ధరలు గురువారానికి రూ.350 నుంచి వెయ్యి వరకు పడిపోయాయి. మార్కెట్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే స్థానికంగా కొనుగోళ్లు చేసే వ్యాపారులు మరింత తక్కువ ధరకు కొంటున్నారు. మార్కెట్ ధరలపై సుమారు రూ.500-1000 వరకు తక్కువ ధర పెడుతున్నారని రైతాంగం వాపోతోంది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధర పెడుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

గణనీయంగా తగ్గిన దిగుబడి

ఈ సీజన్‌లో పంట కోతకు వస్తున్న దశలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిశాయి. ఈ వానలకు అనేక చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వేల ఎకరాలు పూర్తిగా పనికి రాకుండా పోయాయి. వచ్చిన దిగుబడి కూడా నాణ్యత సరిగా లేదని వ్యాపారులు తిరకాసు పెడుతున్నారు. భారీగా ధరలు తగ్గిస్తున్నారు. సాధారణంగా ఎకరానికి నాలుగు క్వింటాళ్లకు పైగా పెసలు దిగుబడి వస్తుంది. కానీ మూడు ఎకరాలు దూస్తే డబ్బా అవుతున్నాయని, డబ్బాకు ఎనిమిది బస్తాలు అంటే దీన్ని ఆరబెట్టి, తరుగు తీస్తే ఆరు బస్తాల చొప్పున దిగుబడి వచ్చినట్టు. పంట కోత సమయంలో వర్షాలు పడి గింజలు ఊబడాలు (గింజకు బూజు) అయ్యాయని రైతులు వాపోతున్నారు. దిగుబడులు సగానికి సగం తగ్గాయని అంటున్నారు. కాబట్టి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.8,682 మద్దతు ధరకు కొనుగోలు చేస్తే కొంతలో కొంతైనా మేలు జరుగుతుందని రైతులు, రైతుసంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. సీజన్‌లో ఇప్పటికే కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన మార్క్‌ఫెడ్ కేంద్రాల నిర్వాహకుల శిక్షణ పేరుతో జాప్యం చేస్తుండటంతో రైతాంగం నష్టపోతోంది. గత ఖరీఫ్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వెయ్యి టన్నుల పెసలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది.

పెట్టుబడులు కూడా రావట్లేదు : రాయల వెంకయ్య, కొణిజర్ల

పెసర పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో అమ్మితే గిట్టుబాటు కావటం లేదు. జెండా పాట రూ.6,500 ఉందని మార్కెట్‌కు వస్తే ఒక్కరోజులోనే రూ.300కు పైగా తగ్గించారు. క్వింటా రూ.నాలుగు వేలకు కూడా కొంటున్నారు.

రైల్వే లోకో రన్నింగ్ సిబ్బందికి 25 శాతం మైలేజీ అలవెన్స్ ఇవ్వాలి

- ఎల్‌ఆర్‌ఎస్‌ఎ సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలి
- రైల్ నిలయం (సికింద్రాబాద్) లోకో రన్నింగ్ స్టాఫ్ నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైల్వే లోకో రన్నింగ్ సిబ్బందికి 25 శాతం మైలేజీ అలవెన్స్ ఇవ్వాలనీ, ఎల్‌ఆర్‌ఎస్‌ఏ సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) సెంట్రల్ కమిటీ పిలుపులో భాగంగా గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం వద్ద సౌత్ సెంట్రల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ సెంట్రల్ ఉపాధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ..పెరిగిన టీఏ (ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్) రేట్లకు అనుగుణంగా కిలోమీటర్ అలవెన్స్ పెంపుదలకు సంబంధించి, ఇన్‌కమ్ టాక్స్ పరిధి నుంచి 70శాతం మైలేజీ అలవెన్స్‌ను, టీఏ (టీఏకు 100శాతానికి మినహాయింపు ఉంది) మాదిరిగా మినహాయించాలని డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ సిబ్బందికి డ్యూటీలో భోజనం, కాలకృత్యాలను తీర్చుకోవడానికి చాలినంత సమయం కేటాయించాలని కోరారు. రిటైర్మెంట్ సమయంలో పెన్షన్‌కు వర్తించే 55 శాతం పెంపును నిరాకరించడాన్ని వెనక్కు తీసుకోవాలనీ, కనిష్ఠ మైలేజ్ అలవెన్స్ పొందే విధంగా హ్యాండిక్యాప్డ్ సెక్షన్స్‌ను గుర్తించాలని సూచించారు. స్టేషన్లలో ఉండే కంపెనీల, పరిశ్రమల గూడ్స్ బండ్లను నడిపినప్పుడు గంటకు 20 కిలోమీటర్ల చొప్పున మైలేజ్ అలవెన్సును చెల్లించాలని సూచిస్తూ కోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం వారాంతపు సెలవు అమలు చేయాలని, రెండు వరుస రాత్రి డ్యూటీల తర్వాత రాత్రి విశ్రాంతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రైల్వే రంగాన్ని బలహీనపరుస్తోందనీ, అంబానీ, ఆదానీలకు భారతీయ రైల్వేలను కారుచౌకగా కట్టబెట్టడం అన్యాయమని విమర్శించారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తూ సామాన్యులపై భారాలు మోపుతున్నారని వాపోయారు. కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించి దేశ ఆర్థిక వ్యవస్థను లూఠీచేస్తున్న తీరును ఎండగట్టారు. రైల్వే, రోడ్, ఎయిర్‌వేస్, డాక్ పోర్టులు, టెలికం, తదితర మౌలిక రంగాలలో నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరిట, నేషనల్ ఎస్సెట్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో లక్షల ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికవర్గం యావత్తు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ రైల్వే జోనల్ కార్యదర్శి సయ్యద్ జిలాని భాషా మాట్లాడుతూ.. లోకో రన్నింగ్ స్టాఫ్ సిబ్బంది హక్కుల కోసం ఎల్‌ఆర్‌ఎస్‌ఏ దశాబ్దాల తరబడి పోరాడుతుందనీ, కోట్లాది ప్రయాణీకుల భద్రతకు రేయింబవళ్లు శ్రమిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్‌ఏ సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం విమర్శించడం అన్యాయమని అన్నారు. భవిష్యత్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌ఏ సిబ్బంది దీర్ఘకాలిక కార్యాచరణకు పూనుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శులు శ్రీజిత్, కె ప్రసాద్, ఎఐజిసి నాయకులు పాండే, ఇక్బాల్ తదితరులు ప్రసంగించారు.

గురువుకు గౌరవమేదీ?

- ప్రపంచీకరణలో పడిపోయిన పంతుళ్లస్థానం
- పట్టించుకోని ప్రభుత్వాలు
- సినిమాలు, ఒటిటిలు, టివిలతో దిగజారుతున్న విలువలు
- ప్రయివేటు విద్యాసంస్థల్లో శ్రమదోపిడీ
- ఉద్యోగ భద్రత కరువు కనీస వేతనాలుండవు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది అన్నారు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్. సమాజానికి, విద్యార్థులకు మార్గదర్శి ఉపాధ్యాయుడు. తన జ్ఞానాన్ని విద్యార్థులకు పంచుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాడు. విలువలు, దేశభక్తిని నేర్పుతాడు. ఆదర్శంగా జీవిస్తాడు. అందుకే గురువు స్థానం వెలకట్టలేనిది. ప్రపంచంలో అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవమున్నది. ఎందుకంటే ఉపాధ్యాయులు సమాజాన్ని ప్రభావితం చేస్తారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్టు విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా టీచర్ల వద్ద ఓనమాలు నేర్చుకున్న వారే. అందుకే టీచర్లకు సముచిత గౌరవం దక్కేది. పాలకులు కూడా ప్రాధాన్యత ఇచ్చేవారు.

సెప్టెంబర్ ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్రపతి, రాష్ట్రాల్లో ఉత్తమ టీచర్లకు ముఖ్యమంత్రి లేదా విద్యామంత్రులు అవార్డులను ప్రదానం చేస్తారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధ్యాయుల కీర్తి ప్రతిష్టలు ఎన్నో ఉన్నాయి. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. గురువుకు సముచిత గౌరవం దక్కడం లేదు. ప్రపంచీకరణలో గురువుల స్థానం మారిపోతున్నది. విద్యాప్రమాణాలు ఎలా దిగజారుతున్నాయో పంతుళ్ల స్థానం కూడా అలాగే పడిపోతున్నది. నూతన ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక విద్యారంగం బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. విద్యా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయుల పట్ల పాలకుల తీరులోనూ ఎంతో మార్పు వచ్చింది. ప్రభుత్వాలు వారిని పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని బాధ్యతగా కాకుండా ఒక తంతుగా నిర్వహిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

ఉపాధ్యాయులపై పెరుగుతున్న ఒత్తిడి

రాష్ట్రంలో 30,137 (గురుకులాలు కలిపి) ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో సుమారు 1.30 లక్షల మంది పని చేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బోధనపై దృష్టిసారించలేకపోతున్నారు. బోధనేతర పనులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఒత్తిడి పెరుగుతున్నది. ఇంకోవైపు ప్రభుత్వ విద్యారంగంలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, తాత్కాలిక, గెస్ట్ ఇలా వివిధ రకాల పేరుతో నియమిస్తున్నారు. వారికి ఉద్యోగ భద్రత లేదు. ఉపాధ్యాయ ఖాళీలను, బోధనేతర సిబ్బందిని సకాలంలో భర్తీ చేయడం లేదు.

దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. ఉపాధ్యాయులే బిల్లులు పంపించడంతోపాటు బెల్లులు కొట్టాల్సిన పరిస్థితి దాపురించింది. చదువు చెప్పాలా? బోధనేతర పనులు చేయాలా?అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే ఉపాధ్యాయులంటే సమాజంలో చిన్నచూపు ఉండేలా సినిమాలు, ఒటిటిలు, టీవీల్లో సీరియళ్లతోపాటు వివిధ కార్యక్రమాలు ప్రభావితం చేస్తున్నాయి. వాటి ప్రభావంతో విద్యార్థుల్లో నేరప్రవృత్తి పెరుగుతోంది. పిల్లలను దండించే పరిస్థితి ఇప్పుడు లేదు. దీంతో విలువలతోపాటు విద్యా ప్రమాణాలు కూడా పడిపోతున్నాయి. ఉపాధ్యాయులంటే విద్యార్థులకు గౌరవం ఉండడం లేదు.

ప్రయివేటు టీచర్ల అరిగోస

దేశంలో, రాష్ట్రంలో ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. రాష్ట్రంలో 11,757 ప్రయివేటు బడుల్లో సుమారు 2.30 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారికి సర్వీసు నిబంధనలుండవు. ఉద్యోగ భద్రత కరువు. కనీస వేతనాలు అమలు కావు. పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేసే ప్రయివేటు పాఠశాలలు కొన్ని మాత్రమే. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి. కానీ కనీస వేతనాలు ఇవ్వకుండా ఉపాధ్యాయులను శ్రమదోపిడీ చేస్తున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు అన్నీఇన్నీ కావు. కానీ ప్రభుత్వాలు వారికి న్యాయం చేసే దిశగా ఆలోచించడం లేదు.

గురువులకు సముచిత గౌరవం ఇవ్వాలి : చావ రవి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

గురువులకు సముచిత గౌరవం ఇవ్వాలి. ఏడాదికోసారి సెప్టెంబర్ ఐదో తేదీన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడమే కాకుండా అందరినీ ప్రభుత్వం పట్టించుకోవాలి. బోధనేతర సిబ్బందిని నియమించాలి. బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలి. ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పట్ల శ్రమదోపిడీని అరికట్టాలి. సర్వీసు నిబంధనలు రూపొందించాలి. కనీస వేతనాలను అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రతిభావంతులను ఉపాధ్యాయ వృత్తిలోకి ఆకర్షించాలి. ఇంటర్ పూర్తయ్యాక ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో ఎక్కువ మంది చేరతారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న వాళ్లు, త్వరగా స్థిరపడాలని భావించే వారు డిఎడ్, బిఎడ్‌లో చేరుతున్నారు. ఇందులో మార్పు రావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలి. అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యనందించాలి. ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు టీచర్లుండాలి. 40 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే తరగతి గదికొక టీచర్ ఉండాలి. పర్యవేక్షణ వ్యవస్థ పటిష్టం చేసి ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెంచాలి.

అక్టోబర్ 6 వరకు ఎన్‌ఎంఎంఎస్‌ఎస్ గడువు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్‌ఎస్)కు 2025-26 విద్యాసంవత్సరంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు అక్టోబర్ ఆరో తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు పివి శ్రీహరి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుచ చేసేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫీజు ఎస్సి, ఎస్‌టి, విక లాంగులు రూ.50, బిసిలు, ఇతరులు రూ.వంద చెల్లించాలని కోరారు. ఎన్‌ఎంఎంఎస్‌ఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైతే తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఏటా రూ.12 వేలు స్కాలర్‌షిప్ లభిస్తుందని వివరించారు. డిసెంబర్ ఏడో తేదీన ఎన్‌ఎంఎంఎస్‌ఎస్ రాతపరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

హైటెక్స్‌లో పది నుంచి ఐఎంఇసిఇ కార్యక్రమం

హైదరాబాద్ : అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ తొలిసారి భారత్‌లో ఇంటర్నేషనల్ మెకానికల్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ అండ్ ఎక్స్పొజిషన్ (ఐయంఇసిఇ)ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్ 10-13 తేదీల్లో హైటెక్స్‌లో దీన్ని ఏర్పాటు చేస్తోన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. సాంప్రదాయకంగా అమెరికాలో జరిగే ఈ కార్యక్రమాన్ని భారత్‌లో తొలిసారిగా నిర్వహిస్తోన్నామని తెలిపాయి. 1500 పైగా ప్రతినిధులు, 100 పైగా ప్రదర్శకులు హాజరు కానున్నారని అంచనా వేశారు. ముఖ్యమైన స్పీకర్లలో డా. బాబాసాహెబ్ కళ్యాణి, టామ్ కోస్టాబైల్, లెస్టర్ కె, పవన్ కుమార్ చందన వంటి ప్రముఖులు ఉన్నారని పేర్కొంది.

తీజ్ ఉత్సవాల్లో జాన్‌వెస్లీ

గిరిజన సంప్రదాయ 'తీజ్'ను రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సంప్రదాయ పండుగలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పండుగలను ప్రోత్సహించి, గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామంలో గురువారం నిర్వహించిన గిరిజన సంప్రదాయ పండుగ తీజ్ ఉత్సవాలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరయ్యారు. గ్రామస్తులు, పార్టీ నాయకులు స్వాగతం పలికారు. సిపిఎం నాయకులు గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి, తీజ్ బుట్టలు ఎత్తుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పండుగలు ఐక్యతను చాటుతాయని, ఈ ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తీజ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి నర్సింహారావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గండికోట రమేశ్, అనగంటి వెంకటేశ్, పార్టీ మండల కార్యదర్శి రావుల జంగయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ స్వామి, రైతు సంఘం మండల నాయకులు పగడాల వెంకటేశ్, మండల కమిటీ సభ్యులు పగడాల విజయ, పార్టీ గ్రామ కార్యదర్శి బెల్లి పాండు, శాఖ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో 'బేబీ స్పా' ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారి హాస్పిటల్ ఆధారిత 'బేబీ స్పా'ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. బంజారాహిల్స్‌లో అందుబాటులోకి తెచ్చిన దీనిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన లాంచనంగా ప్రారంభించారు. 6 వారాల నుండి 9 నెలల వయస్సు గల శిశువుల కోసం రూపొందిన ఈ స్పా, హైడ్రోథెరపీ, బేబీ మసాజ్, తల్లిదండ్రుల బంధం, శిశువుల అభివృద్ధికి తోడ్పడే ప్రశాంతమైన వేదికగా నిలుస్తుందని ఆ సంస్థ యాజమాన్యం తెలిపింది. ఇది శిశువులు, తల్లిదండ్రుల బంధాన్ని బలోపేతం చేస్తూ, ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపరుస్తుందని కలెక్టర్ హరిచందన పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం సిపిఎం పోరుబాట

- నూతనకల్ మండల కేంద్రానికి పాదయాత్ర
- నిధులు కేటాయించాలని మల్లు లక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంపి, ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వీడి పాడైపోయిన రోడ్లను మరమ్మతులకు నిధులు విడుదల చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పోరుబాట పాదయాత్ర చేపట్టారు. సూర్యాపేట జిల్లా చిల్పకుంట్ల నుంచి గురువారం నూతనకల్ మండల కేంద్రానికి పాదయాత్ర చేపట్టారు. అనంతరం పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి వెంకేపల్లి వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైందని, వెంటనే పున:నిర్మించాలని డిమాండ్ చేశారు. పదేండ్ల నుంచి రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా గుంతలు పడ్డాయని, మాజీ, ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అప్పట్లో ఆ రోడ్డు నిర్మాణం కోసం మండల కేంద్రంలో శంకుస్థాపన చేస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే తిమ్మాపురం నుంచి శంకుస్థాపన చేశారని, దాంతో నిధులు సగానికే సరిపోయాయని తెలిపారు. బాగా గుంటలమయమైన రోడ్డును వదిలి రాజకీయ ప్రయోజనాల కోసం మరోచోట నుంచి పనులు ప్రారంభించడం సరైంది కాదన్నారు. చిల్పకుంట్ల ప్రజలకు ఎమ్మెల్యే మందుల సామేల్ ఎన్నికల ముందు రోడ్డు పున:నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన విషయాన్ని మరిచిపోయారని విమర్శించారు. ఈ రెండు గ్రామాలకు వెంటనే నిధులు కేటాయించి రోడ్డు పనులు చేయించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో పాల్గొన్న ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. తాము ఫైనాన్స్‌లో ఆటోలు కొని కిస్తీలు కట్టలేక ఇబ్బంది పడుతుంటే.. ఈ రోడ్డు గుంతల వల్ల ఆటోలు రిపేరుకు వచ్చి మెకానికులకే ఎక్కువ ఖర్చవుతోందన్నారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ నాగరాజు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కళ్యాణ్ వచ్చి వారితో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం కోసం నిధుల అంచనా వేసి సంబంధిత అధికారులకు రెండుసార్లు నివేదిక పంపామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని.. వచ్చిన వెంటనే రోడ్డు పనులు చేపడుతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నాయకులు పులుసు సత్యం, కందాల శంకర్ రెడ్డి, బొజ శ్రీను, బత్తుల జనార్ధన్ గౌడ్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ, పిఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలి

- మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయంలో సిఐటియు వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమ్మక్క డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో ఐసిడిఎస్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయంలో ఎనిమిది రకాల వినతిపత్రాలు అందజేశారు. తమ డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలనీ, ఎఫ్ఆర్ఎస్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన వారిని జీవో నెంబర్ ఎనిమిది పరిధిలోకి తీసుకొచ్చి పెరిగిన బెనిఫిట్స్ అమలు చేయాలనీ, పది నెలల సిబిఇ అమౌంట్ వెంటనే చెల్లించాలని కోరారు. 24 రోజుల సమ్మె వేతనాలు, మూడు నెలల పిఆర్‌సి ఏరియర్స్, బతుకమ్మ సెలవులు ఇవ్వాలని విన్నవించారు. ఇప్పుడు ఇస్తున్న యూనిఫాంలను తక్షణమే వెనక్కి తీసుకోవాలనీ, సింగిల్ కలర్ నాణ్యమైంది ఇవ్వాలని విన్నవించారు. స్థిరంగా ఒకే మోడల్ ఉంచాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తొందరగా పరిష్కారమయ్యే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఆర్ఐటిటిపిసి ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మెడికల్ రేడియాలజీ ఇమేజింగ్ అండ్ థెరపటిక్ టెక్నాలజీ ప్రొఫెషనల్ కౌన్సిల్ అధ్యక్షులుగా నిమ్స్ ఇన్ చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సిరాందాస్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ కమిషన్ ఆఫ్ అలైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ కార్యదర్శి ఉమేశ్ బలోండా నోటిఫికేషన్ విడుదల చేశారు. శ్రీనివాసులు ఈ పదవిలో రెండేండ్లపాటు కొనసాగనున్నారు. నేషనల్ కౌన్సిల్ ఏర్పాటులోనూ శ్రీనివాసులు కీలకపాత్ర పోషించారు. శ్రీనివాసులు నియమితులు కావడం పట్ల నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారయణ, రేడియో డయాగ్నసిస్ విభాగాధిపతి రామ్మూర్తి అభినందనలు తెలిపారు. శ్రీనివాసులును ప్రెసిడెంట్ గా నియమించినందుకు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. శ్రీనివాసులు ప్రస్తుతం ఈ సొసైటీకి సిఇవొగా సేవలందిస్తున్నారు.

టిడిపి అద్భుతమైన పార్టీ అయితే.. మరి కాంగ్రెస్‌లో ఎందుకు చేరావు?

- సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన దేవీప్రసాద్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

టిడిపి అద్భుతమైన పార్టీ అయితే కాంగ్రెస్‌లో ఎందుకు చేరావు? అని సిఎం రేవంత్ రెడ్డిని బిఆర్ఎస్ నేత జి దేవీప్రసాద్ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉండి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన టిడిపి గొప్పతనం గురించి మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి వైఖరిపై కాంగ్రెస్ శ్రేణులు ఆలోచించుకోవాలని ఆయన సూచించారు. చీమలు పెట్టిన పుట్టలో పాములా రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. సిఎం ఎక్కడ పర్యటించినా బిఆర్ఎస్ నేతలపై నిర్బంధాలు విధిస్తున్నారనీ, ఎన్ని నిర్బంధాలు పెట్టినా కాంగ్రెస్ హామీలు అమలు చేసేంతవరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. సిబిఐ విషయంలో గతంలో ఒకలాగా, ఇప్పుడొకలాగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మాటమార్చారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అవినీతిని ఏజెన్సీలే తేల్చలేకపోయాయనీ, కవిత లాంటి వ్యక్తి తేలుస్తారా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ వద్దన్న సిబిఐని తెలంగాణలోకి ప్రవేశం కల్పిస్తూ సిఎం రేవంత్ రెడ్డి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన బిఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నేతలు గాంధీ నాయక్, బొమ్మెర రామమూర్తి పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల్లో సమస్యలను పరిష్కరించండి

- ఇంటర్ విద్యా డైరెక్టర్‌కు టిజిజెఎల్‌ఎ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని టిజిజెఎల్‌ఎ-475 ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇంటర్ విద్యా డైరెక్టర్ కృష్ణ ఆదిత్యను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ కలిసి వినతిపత్రం అందజేశారు. 2023లో రెగ్యులరైజ్ అయిన అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. 3,200 మంది నూతన అధ్యాపకులకు రెండో ఇంక్రిమెంట్, ఎఫ్ఎసి ప్రిన్సిపల్ విధులను కేటాయించాలని సూచించారు. యుజిసి గుర్తింపు ఉండి ఇతర రాష్ట్రాల్లోని వర్సిటీల్లో పీజీ చేసిన వారి సర్టిఫికెట్లను వెంటనే పరిశీలించాలని తెలిపారు. రోస్టర్, రిజర్వేషన్ పాయింట్లు కేటాయించి ప్రొబేషన్ డిక్లరేషన్‌ను పూర్తి చేయాలని పేర్కొన్నారు. నూతన అధ్యాపకులకు మెడికల్ అండ్ స్పౌజ్ అవసరం ఉన్న వారికి ఓడీ, డిప్యూటేషన్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. గతేడాది పనిచేసిన కాంట్రాక్టు, పార్ట్‌టైం, గెస్ట్ అధ్యాపకుల రెన్యూవల్ ఉత్తర్వులను విడుదల చేయాలనీ, వారికి ఐదు నెలల వేతన బకాయిలను చెల్లించాలని కోరారు.

'సాఫ్ట్‌వేర్' అవయవదానంతో ముగ్గురికి కొత్త జీవితం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నెల్లూరుకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేసిన అవయవదానంతో ముగ్గురికి కొత్త జీవితం లభించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన (28 ఏళ్ల) జావా సాఫ్ట్‌వేర్ డెవలపర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆ విషాద సమయంలోనూ ఆ యువకుని కుటుంబం అవయవదానం చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆ యువ ఇంజనీర్ ఆగస్టు 30న ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రగాయాల పాలయ్యారు. ఆయనను మొదట ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం స్టార్ ఆస్పత్రికి తరలించి...నిరంతర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. దీంతో సెప్టెంబర్ 2న న్యూరాలజికల్ టెస్టులు, ఈఈజీ రిపోర్టులు, రెండు అప్నియా టెస్టులు చేసి అనంతరం బ్రెయిన్‌డెత్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. ఇంజినీర్ అవయవదానంతో ఆయన కాలేయం ఒకరికి, ఒక మూత్రపిండం మరొక రోగికి విజయవంతంగా అమర్చారు. రెండో మూత్రపిండాన్ని మరో ప్రయివేటు ఆస్పత్రిలోని రోగికి అందించడంతో ముగ్గురికి కొత్త జీవితం లభించింది. అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబానికి స్టార్ ఆస్పత్రి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విస్తృత సేవలతో ఇందిరమ్మ ఇళ్ల 'యాప్'

- లబ్ధిదారులే ఫోటోలను అప్‌లోడ్ చేసుకునే అవకాశం
- గృహనిర్మాణ కార్పొరేషన్ ఎండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు కొత్త 'యాప్' తీసుకొచ్చామని గృహనిర్మాణ కార్పొరేషన్ ఎండి విపి గౌతం చెప్పారకు. తమ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను లబ్ధిదారులే స్వయంగా ఫోటోలను అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు. తద్వారా సకాలంలో బిల్లులు పొందే అవకాశం ఉందని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్ణీత సమయంలో లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేసేందుకు యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల యాప్ వినియోగంపై సమగ్రమైన అవగాహన కల్పించాలని సూచించారు. లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు, ఇంతవరకు చేసిన చెల్లింపుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. ఆ విషయాలను ఎప్పుడైనా, ఎక్కడైనా తెలుసుకునే విధంగా యూనివర్సల్ సెర్చ్ అవకాశాన్ని కల్పించడంతో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణపు పనులు బిల్లుల దశకు వచ్చిన 15 రోజుల్లో నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చూడాలన్నారు. ఇప్పటికే ఈ విధానాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చినట్టు చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో బిసి విద్యార్థులకు అన్యాయం

- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు అన్యాయం చేస్తున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నడుస్తున్న న్యాయ విశ్వవిద్యాలయం నల్సార్‌తో పాటు జాతీయ న్యాయ కళాశాలల్లో బిసి రిజర్వేషన్లు అమలు కావడం లేదని తెలిపారు. అన్ని న్యాయ విశ్వ విద్యాలయాల్లో 27 శాతం ఒబిసి రిజర్వేషన్లతో పాటు స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని 2020లో నేషనల్ బిసి కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. రూల్ ఆఫ్ లా న్యాయ విశ్వ విద్యాలయాల్లోనే అమలు కాకపోవడం ఏమిటీ? అని ప్రశ్నించారు. బిసి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. ఈ వివక్షకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బిసి కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దూది మెట్ల బాలరాజ్ యాదవ్, చిరుమళ్ల రాకేష్ కుమార్, జాతీయ ఒబిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు కిరణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి

- ప్రాణం తీసిన డ్రైవర్ నిర్లక్ష్యం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వారం రోజులు జ్వరంతో పాఠశాలకు వెళ్లని ఆ చిన్నారి.. గురువారం పాఠశాలకు వెళ్లగా.. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రాణం కోల్పోయింది. బస్సు టైర్ల కింద నలిగి విలవిల్లాడింది. ఈ విషాదకర ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని దుప్పలపల్లి రోడ్డులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం తొర్రగల్ గ్రామానికి చెందిన చింతపల్లి రాధిక -సైదులు దంపతుల కుమార్తె చింతపల్లి జశ్విత (5) నల్లగొండ పట్టణంలోని మాస్టర్ మైండ్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. వారం రోజులు జ్వరం వల్ల జశ్విత పాఠశాలకు వెళ్లలేదు. గురువారం పాఠశాలకు బస్సులో వెళ్లింది. పాఠశాలకు చేరుకున్నాక విద్యార్థులంతా బస్సు దిగారు. ఆ సమయంలో జశ్విత బస్సు ముందు వైపు నుంచి తరగతి గదిలోకి వెళ్తుండగా.. అది గమనించకుండా డ్రైవర్ కదిలించడంతో చిన్నారిపై టైర్లు ఎక్కాయి. తీవ్రంగా గాయపడి జశ్విత అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న చిన్నారిని చూసి బోరున విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న డిఇఒ బొల్లారం భిక్షపతి ప్రభుత్వాస్పత్రిలో బాలిక మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని ఆయన చెప్పారు. ఈ ఘటన బాధాకరమన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్

- అత్యాధునిక టెక్నాలజీకి జిహెచ్ఎంసి శ్రీకారం
- ముంపు సమస్యల పరిష్కారం కోసం..పైలట్ ప్రాజెక్టు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వర్షాకాలంలో వరదలతో గ్రేటర్ అతలాకుతలమవుతోంది. ఈ క్రమంలో సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ఆధునిక టెక్నాలజీ వినియోగానికి సిద్ధమవుతోంది. రోబోటిక్ టెక్నాలజీతో స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్‌ను ప్రవేశపెట్టింది. నగరంలో వాటర్ డ్రైన్‌లు పొంగిపొర్లడం, ట్రాఫిక్ జామ్, లోతట్టు ప్రాంతాలు, బస్తీలు, కాలనీలు ముంపునకు గురవ్వడం వంటి సమస్యలు సర్వసాధారణమయ్యాయి. కాల్వల్లో చెత్తాచెదారం అడ్డు పడటం, కాల్వలు దెబ్బతినడం, అధిక వర్షపాతంతో కాల్వలు పొంగిపొర్లుతుంటాయి. వీటన్నిటికీ చెక్ పెట్టేందుకు రోబోటిక్ అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాలని జిహెచ్ఎంసి నిర్ణయించింది.

మొట్టమొదటగా సర్కిల్-12

నాలాల్లో బెడ్‌షీట్స్, బెడ్స్, ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు వేస్తున్నారు. దాంతో వర్షం నీరు, మురుగు పారుదలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. జిహెచ్ఎంసి, వాటర్‌బోర్డు సిబ్బంది ఎప్పటికప్పుడూ వాటిని క్లీన్ చేస్తున్నా సమస్యలు తప్పడం లేదు. దాంతో కొత్త టెక్నాలజీ వినియోగానికి జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షపు నీటి కాలువల శుభ్రతకు రోబోటిక్ సాంకేతికతను ఉపయోగించుకుంటున్నది. మొట్టమొదటగా సర్కిల్-12లో పైలట్ ప్రాజెక్ట్‌గా స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్‌ను ప్రారంభించారు. ప్రత్యేకంగా అధునాతన సిసిటివి కెమెరాలు అమర్చారు. ఈ విధానంతో కాలువల్లోని అడ్డంకులను ఖచ్చితంగా గుర్తించి, తొలగించడం, బురదను వేగంగా, సమర్థవంతంగా తొలగించి వర్షాల సమయంలో నీటి నిల్వలను తగ్గించి డ్రయినేజీ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ఫీల్డ్ స్టాఫ్, ప్రజల భద్రతకు ఎలాంటి హానీ జరగకుండా పటిష్టమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తూ క్లీనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ విధానం సఫలీకృతమైతే జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పరిశీలించిన అధికారులు

అధునాతన సిసిటివి కెమెరాలు ఉన్న రోబోటిక్ యంత్రాల ద్వారా ప్రధాన రోడ్డు క్రాసింగ్‌లో వర్షపు నీటి కాలువల శుభ్రత చేపట్టగా, చీఫ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) సహదేవ్ రత్నాకర్ ఈ విధానంలో క్లీనింగ్ ప్రక్రియను బుధవారం రాత్రి మెహదీపట్నం ఎన్ఎండిసి జంక్షన్‌లో పరిశీలించారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం చేరిలా గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిర్జాపల్లి బాబు (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇల్లు కట్టుకొని, రెండు ఎకరాల పొలం కొన్నారు. వాటి కోసం రూ.25లక్షలు అప్పుచేయగా రూ.ఐదు లక్షలు చెల్లించినా ఇంకా రూ.20 లక్షల అప్పు ఉంది. ఈ క్రమంలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసి అప్పులు తీరుద్దామనుకున్నారు. పంటలు సరిగ్గా పండకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. అప్పు ఇచ్చిన వారు పదేపదే అడగడంతో మనస్తాపానికి గురయ్యాడు. కాగా, రోజులాగే గురువారం కూడా పొలానికి నీరు పారపెట్టేందుకు ఉదయం వెళ్లిన బాబు.. చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు.. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు.